www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

## JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in
7207282727 | 72707292727



## వినాయక నిమజ్జనంలో విషాదం

3

గురువారం, 17-09-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :130 Issue : 130 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదు



- దామాషా ప్రకారం సీట్లు పెంచితే డీలిమిటేషన్‌కు మద్దతు
- జిందాల్ వర్సిటీలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఉపన్యాసం

2



### హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా

## తీర్చిదిద్దుతున్నాం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

తొలి దశలో మూసా, ఈసా నదుల సంగమం గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవనం చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధితోపాటు నైట్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సింగపూర్

మిగతా 3వ పేజీలో..



## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు ప్రోత్సహించండి

- ఆ దేశ ప్రతినిధుల బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు

2

### పాలమూరు నీటి గోస తీర్చిన

## భగీరథుడు కేసీఆర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పాలమూరు-రంగారెడ్డి పథకం నార్లాపూర్ పంపులు ప్రారంభించి మూడేళ్లు

2

### బీఆర్ఎస్ భూములపై

## బీజేపీ దండయాత్ర



- ఆ భూముల్లో కాషాయ జెండాలు ఎగరేసి పేదలకు పంచుతాం
- ఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే భూముల చిట్టా విప్పారు
- కేసీఆర్ ఫాంహౌజ్‌లో సర్కార్ భూమి ఉందని తేల్చడానికి 33 నెలలు పట్టిందా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

బీఆర్ఎస్ దోచుకున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో దండ యాత్ర చేస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ భూముల్లో కాషాయ జెండా ఎగరేసి పేదలకు పంచి పెడతామని చెప్పారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ భూ దోపిడీని సీఎం ప్రస్తావించడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. యూపీ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే

మిగతా 2వ పేజీలో..

## కేసీఆర్ ఫామ్ హౌస్ విచారణ

# ఆదేశం

### 30 రోజుల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అదేశాలు

- కల్వకుంట్ల కుటుంబ ఆస్తులపై సర్వే నంబర్లతో సహా వెల్లడి
- ఫామ్ హౌస్ పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న సీఎం
- ప్రభుత్వ భూమిగా తేలితే పేదలకు పంచుతామని ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిధిలోని భూములపై సమగ్ర విచారణకు సీఎం రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ వేదికగా ఈ సంచలన ప్రకటన చేసిన సీఎం.. కేసీఆర్ ఫామ్ హౌస్ ఆధీనంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం

మిగతా 2వ పేజీలో..



### ధరణిని అడ్డంపెట్టుకున్నారు..

## పట్టాలు చేసుకున్నారు

- 22ఏ పేరుతో నిండలు వేయాలనుకున్నారు
- మేము అన్నీ బయటపెడుతున్నాం
- వీటిపై చర్చ జరగకూడదనే గందరగోళం చేశారు
- శాసన సభలో బీఆర్ఎస్‌పై సీఎం తీవ్ర విమర్శలు

2






### సిట్టింగ్ జడ్జితో విచారణకు

## మేము సిద్ధం

- రేవంత్ కుటుంబీకుల ఆస్తుల పెరుగుదలపై ఎంక్వైరీ జరగాలి
- మాజీ మంత్రి హరీష్ రావు

2



## గజం భూమి ఎక్కువ ఉన్నా సరెండర్ చేస్తా

- సీఎం ప్రస్తావించిన అందరి భూములపై సీబీఐ విచారణ జరపాలి
- గుంపు మేస్త్రీతో గుంటనక్క కుమ్మక్కు ముమ్మాటికీ వాస్తవం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

3



## ఝిరాం వ్యాలీ కేసులో 10 మందికి మరణశిక్ష

- 2013 నాటి మావోయిస్టు దాడి కేసులో కీలక తీర్పు
- కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీపై దాడిలో 32 మంది మృతి
- ముద్దాయిలను దోషులుగా నిర్ధారించిన ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం
- దాడి వెనుక నెట్‌వర్క్, కుట్రపై సాగిన దర్యాప్తు
- తదుపరి న్యాయపరమైన ప్రక్రియపై ఉత్కంఠ

4

# పొదుపుతోనే డిమాండ్‌ను దాటగలం



- ఇంధన సామర్థ్యమే మరో విద్యుత్ కేంద్రం
- రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా లక్ష్యం
- సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్ :**

విద్యుదుత్పత్తితోపాటు వినియోగాన్ని సమర్థవంతంగా తగ్గించడం ద్వారా కూడా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించవచ్చని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 'మనం ఉత్పత్తి చేసే విద్యుత్ యూనిట్ కంటే అవసరం లేకుండా పొదుపు చేసే విద్యుత్ యూనిటే చౌకైనది' అని పేర్కొన్నారు. ఇంధన సామర్థ్యాన్ని పర్యావరణ పరిరక్షణ అంశంగా కాక ఆర్థిక పోటీతత్వాన్ని పెంచే వ్యూహంగా చూడాలని సూచించారు. హెచ్ఐసీసీలో బుధవారం జరిగిన 25వ సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్ 2026లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇప్పటివరకు ఇంధన విధానాన్ని ప్రధానంగా సరఫరా కోణంలోనే చూశామన్నారు. ఎంత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది.. ఎంత బొగ్గు అందుబాటులో ఉంది.. ఎంత పునరుత్పాదక విద్యుత్‌ను జోడించగలం.. ఎంత ట్రాన్స్‌మిషన్ మౌలిక వసతులు అవసరం వంటి అంశాలపై దృష్టి పెట్టామని చెప్పారు. అయితే

మిగతా 3వ పేజీలో..

## అప్పుడు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?



- హరీష్‌రావుపై మంత్రి పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్‌వోసీ ఆరోపణ
- గంగుల విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్
- 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు


2



## మేడిగడ్డ బ్యారేజీకి పోటెత్తిన వరద

- 1.08 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు

3



## అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

- 2024 సంవత్సరానికి పురస్కారానికి ఎంపికైన ప్రముఖ నటుడు
- కన్నడ సినీ రంగంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న నటనా ప్రస్థానం
- కథానాయకుడిగా, సహాయ నటుడిగా విభిన్న పాత్రల్లో గుర్తింపు
- తెలుగు సహా ఇతర భాషల చిత్రాల్లోనూ నటించిన అనంత్ నాగ్
- సుదీర్ఘ సినీ సేవలకు ప్రతిష్ఠాత్మక గౌరవం

4

# బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీలో ప్రస్తావించి ఆ పార్టీతో బేరసారాలకు సిద్ధమయ్యారని చెప్పారు. భూముల విచారణ పేరుతో బీఆరఎస్‌తో చీకటి ఒప్పందం ఖాయం.. యూపీ ఎన్నికల కోసం అవసరమైన డబ్బులను బీఆర్ఎస్ సర్దడం తథ్యం అన్నారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కలిసి సంజయ్ మానకొండూరు, చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో బుధవారం పర్యటించి గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఉత్సాహంగా నిమజ్జనోత్సవాలు జరుపుకునేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జనోత్సవాల కోసం రూ.1.5 కోట్లను కేటాయించామని, గతేడాదితో పోలిస్తే మూడింతలు ఎక్కువ అని చెప్పారు. నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా మ□డు రోజుల ముందే నీళ్లను విడుదల చేయాలన్నారు. ప్రజల సెంటిమెంట్‌తో ఆటలాడితే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిదిమంది ఎమ్మెల్యేల భూబాగోతం గురించి మాట్లాడటానికి గంట సమయం పట్టింది. మరి 90 మంది ఎమ్మెల్యేల భూబాగోతం గురించి మాట్లాడాలంటే ఎన్ని రోజులు అసెంబ్లీ నిర్వహించాలి అని ప్రశ్నించారు. రాష్ట్రం.లో 60 శాతం మంది ప్రజలకు భూముల్లేవు. 25 లక్షల కుటుంబాలకు ఇల్లు కట్టుకోవడాని గజం జాగా కూడా లేదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం వేల ఎకరాలను దోచుకున్నారు అని ఆరోపించారు. పాదయాత్రలో నేను భూ దోపిడీ గురించి మాట్లాడితే కేసీఆర్ తన తలను ఆరు ముక్కలు చేస్తానన్నారు.. అయినా కేసీఆర్ మెడలు వంచి ఫాంహౌజ్ నుండి గుంజుకొచ్చి ప్రజల ముందుంచిన అని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని చెప్పడానికి వెయ్యి రోజులు పట్టిందా సీఎంగారూ.. బీఆర్ఎస్ నేతలతో డీల్ కుదరలేదా.. ఏఐసీసీకి కట్టాల్సిన ఈఎంఐ గడువు ముంచుకొస్తుండటంతో ఒత్తిడి పెరిగిందా.. అసెంబ్లీ వేదికగా వివరాలు బయటపెట్టి వారికి ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారా అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా 'సిట్' పేరుతో మీరు నియమించిన విచారణ కమిటీలు ఏమయ్యాయి అని అడిగారు. బేరాలు కుదరగానే సిట్‌ను నీరుగార్చడం సీఎంకు అలవాటే కదా అని ఎద్దేవా చేశారు. సీఎం సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ లా కమిటీలు మారాయన్నారు. ఈ భూములపై కూడా విచారణ పేరుతో ఇంకెన్నాళ్లు లాగుతారు అని అడిగారు. కలెక్టర్లకు పూర్తి అధికారాలిస్తే 24 గంటల్లో పూర్తి నివేదిక ఇస్తారు.. కానీ 30 రోజుల గడువు పేరుతో డీల్ కుదుర్చుకోవాలనుకుంటున్నారా అని రేవంత్‌ను ఆయన ప్రశ్నించారు. రూ.లక్షల కోట్ల విలువైన కేసీఆర్ ఫాంహౌస్‌లోని భూములను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదన్నారు. విద్యుత్ కొనుగోళ్లు, ఈ ఫార్ములా రేసు, కాళేశ్వరం, గొర్రెల స్కాంసహా కేసులన్నీ ఏమయ్యాయి అని అడిగారు. పేదలు అటవీ భూముల్లో సాగు చేస్తే నానా ఇబ్బందులు పెడతారు కదా.. వందల ఎకరాల అటవీ భూమిని కబ్జా చేస్తే చర్యలేవి అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆరఎస్‌లు దొందూ దొందే.. సీఎం మాట చెబితే అది శాసనం కావాలి. కానీ బీఆర్ఎస్‌తో బేరసారాల కోసం భూ దోపిడీని వాడుకోవడం సిగ్గు చేటు.. ప్రజలు ఛీకొడుతున్నారు అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల చీకటి ఒప్పందాలపై జనం తిరగబడే రోజులు రాబోతున్నాయి అని హెచ్చరించారు. కాగా, తెలంగాణను అభివృద్ధి చేయాలని మోదీ తాపత్రయ పడుతున్నారని, అందులో భాగంగా బుల్లెట్ ట్రైన్లను మంజూరు చేస్తే వాటికి కేటాయించిన భూములను సైతం బీఆర్ఎస్ వాళ్లు చేశారని మంత్రి సంజయ్ ఆరోపించారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణకు మేము సిద్ధం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్:**

'మీ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో.. మా హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా ? హైకోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దామా రేవంత్ రెడ్డి' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్ లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీలంటూ కాలయాపన చేస్తున్న సీఎం తన సొంత ఇల్లు విషయంలో మాత్రం ఎలాంటి కమిటీలు వేయకుండా ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. కేటీఆర్ మీద, తన మీద, బీఆర్ఎస్ నాయకుల మీద ఎన్ని ఆరోపణలు చేసినా తాము విచారణకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి మొదలుకుని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ 7 నుంచి నేటి వరకు 'భూభారతి' వరకు జరిగిన ప్రతి అవకతవకపై సమగ్ర విచారణ జరిపించుకుందామని సవాల్ విసిరారు.

**రేవంత్ కుటుంబం ఆస్తులపై విచారణ జరగాలి**

తమ ఆస్తులతోపాటు రేవంత్ రెడ్డి, ఆయన తమ్ముళ్ల ఆస్తులు ఎలా పెరిగినాయనే దానిపై కూడా సిట్టింగ్ జడ్జితో ఎంక్వైరీకి సిద్ధమా అని హరీశ్ రావు సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి కుటుంబానికి ఏకంగా 308 ఎకరాల భూమి ఉందని తమకు సమాచారం వచ్చిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి భూమి పక్కనే ఓఆర్ఆర్ అలైన్మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు కూడా వచ్చాయని పేర్కొన్న ఆయన ఫ్యూచర్ సిటీ చుట్టూ, ఇతర ప్రాంతాల్లో ఉన్న భూముల వివరాలన్నింటినీ సేకరిస్తున్నామని స్పష్టం చేశారు.

# అప్పుడు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

మాజీ మంత్రి హరీష్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు తన మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని హరీష్‌రావును ప్రశ్నించారు. అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది అని అడిగారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌వోసీ ఇచ్చిందన్న హరీష్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అంటూ ఆ విషయం హరీష్‌రావుకు తెలియదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌వోసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# కేసీఆర్ ఫామ్ హౌస్ విచారణకు ఆదేశం!

**మొదటిపేజీ తరువాయి**

చేశారు. ఒకవేళ సకాలంలో విచారణ పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు, మంత్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విపరీతంగా ఆస్తులు కూడబెట్టారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం పేరు మీద ఎక్కడెక్కడ, ఎన్ని ఎకరాల స్థిరాస్తులు ఉన్నాయో సర్వే నంబర్లతో సహా సభలో చదివి వినిపించారు. కేసీఆర్ దంపతులకు 27 ఎకరాలు ఉండాల్సి ఉండగా ఏకంగా 67 ఎకరాల భూమి ఉందని తెలిపారు. కేటీఆర్ కుటుంబంలో నలుగురి పేరు మీద 123 ఎకరాల భూములు ఉన్నాయని వెల్లడించారు. ఇందులో కేటీఆర్ పేరు మీద 49.5 ఎకరాలు, ఆయన భార్య శైలిమ పేరు మీద 17.5 ఎకరాలు, అలేఖ్య పేరు మీద 9.38 ఎకరాలు, హిమాన్షి పేరు మీద 46.3 ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. ఉద్యమాన్ని, ధరణిని అడ్డంపెట్టుకుని భారీగా దోపిడీ చేశారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఫామ్ హౌస్ పరిధిలో దాదాపు 340 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అసలు ఆ ఫామ్ హౌస్ భూమి కథేంటో తేల్చాలని ఇప్పుడే కలెక్టర్‌ను ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌కు తక్షణమే నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారుల విచారణలో అది ప్రభుత్వ భూమిగా తేలితే, ఆ భూమినంతటినీ పేదలకు పంచుతామని ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు.. ఫాం హౌస్ రంగనాయక సాగర్ దగ్గర ఉందని.. హరీష్‌రావు తన ఫాం హౌస్ కు స్పెషల్ గా రోడ్డు వేయించుకున్నాడని చెప్పారు. 10 ఎకరాల ఇరిగేషన్ భూమిని సుడాకు హరీశ్ బదిలీ చేయించాడని సీఎం రేవంత్ చెప్పారు. 9 జిల్లాలు, 24 మండలాలు, 31 గ్రామాల్లో కేసీఆర్ ఫ్యామిలీకి 440 ఎకరాల భూమి ఉందని సీఎం ప్రకటించారు. సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో హరీశ్ రావు ఫాంహౌస్ కు రోడ్లు వేయించుకున్నాడని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఫ్యామిలీకి షాబాద్ లో 47 ఎకరాలు ఉన్నాయని సీఎం చెప్పారు. ఇందులో 11.5 ఎకరాల ఇనాం భూములు తీసుకున్నారని.. ఇనాం భూములు జగదీశ్వర్ రెడ్డికి ఎలా పట్టా అయిందని సీఎం రేవంత్ ప్రశ్నించారు. పైలెట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ అసైన్డ్ భూముల్లో ఉందని సీఎం వెల్లడించారు. కిషన్ రెడ్డి సొంతూరు తిమ్మాపూర్ లో కబ్జాలు చేశారని.. తిమ్మాపూర్ లో 77 ఎకరాల భూదాన్ భూమి ఉందని సీఎం చెప్పారు. 77 ఎకరాల భూదాన్ భూమి ప్రైవేట్ వ్యక్తుల పేరు పైకి వెళ్లిందని, అసలు భూదాన్ భూములు ఎలా పట్టా చేశారని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. 77 భూదాన్ భూములపై మాట్లాడితే సబిత తనను విమర్శిస్తోందని.. బహదూర్ పుర, తిమ్మాపూర్ భూములపై విచారణ జరగాలని సీఎం అభిప్రాయపడ్డారు. గోల్డ్ స్టోన్ ప్రసాద్ ఎవరికి బంధువని సీఎం ప్రశ్నించారు. నమస్తే తెలంగాణ ఎండీకి విలువైన కార్లు ఎలా వచ్చాయని విస్మయం వ్యక్తం చేశారు. గోల్డ్ స్టోన్ ప్రసాద్ నుంచి గిఫ్ట్‌లు తీసుకుంది మీరు కాదా అని బీఆర్ఎస్ ను ఉద్దేశించి రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. బోయిన పల్లి వినోద్, బోయినపల్లి శ్రీనివాస రావు కేసీఆర్ బినామీలు అని సీఎం రేవంత్ ఆరోపించారు. వట్టినాగులపల్లిలో శ్రీనివాసరావు కబ్జాలను బయటపెడతానని సీఎం స్పష్టం చేశారు. భూపాలపల్లిలో 106 ఎకరాల ఫారెస్ట్ భూములు తొలగించి రిజిస్ట్రేషన్ చేశారని సీఎం వివరించారు. గండ్ర వెంకటరమణా పేరుతో 106 ఎకరాల ఫారెస్ట్ భూమి రిజిస్ట్రేషన్ అయి ఉందని చెప్పారు. నెలిమలి గ్రామంలో 13 వందల ఎకరాల భూమి బీఆర్ఎస్ వ్యక్తి పట్టా చేసుకున్నాడని సీఎం బయటపెట్టారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు మారాయని, 8 వేల ఎకరాలు బీఆర్ఎస్ నేతల పేరుపైకి మార్చుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. హరీష్ రావు పేరు మీద 27 ఎకరాలు, ఆయన భార్య పేరు మీద 8 ఎకరాల భూమి ఉందని సీఎం చెప్పారు. కవిత ఫ్యామిలీకి 37 ఎకరాల భూమి ఉందని తెలిపారు. జోగినపల్లి సంతోష్ పేరుతో 53 ఎకరాలు ఉందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా సర్వే నంబర్లతో సహా వివరాలను బయటపెట్టారు.

# వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదు

**సోనిపట్(హర్యానా), ఆశ్వి అప్డేట్స్ :**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో (2028) బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో ఎలాంటి పొత్తు పెట్టుకోదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోనిపట్ (హర్యానా)లోని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్ అనే అంశంపై ఆయన బుధవారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాజకీయాలు, పాలన, సాంకేతికత తదితర అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకునే అవకాశం ఉందా అని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ పైవిధంగా స్పందించారు. డీలిమిటేషన్ పై మాట్లాడుతూ మొత్తం లోక్‌సభ స్థానాల సంఖ్యను దేశవ్యాప్తంగా దామాషా ప్రకారం పెంచితే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో తమ పార్టీకి ఎలాంటి అభ్యంతరం ఉండదని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. కృత్రిమ మేధస్సు(ఏఐ), సాంకేతిక మార్పులపై ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రతి పెద్ద సాంకేతిక పరివర్తన సమయంలోనూ ఆందోళనలు వ్యక్తమయ్యాయని కేటీఆర్ అన్నారు. ప్రతి సాంకేతిక మార్పును ప్రశ్నించారు.. ఏఐ విషయంలోనూ అదే జరుగుతోంది. మనం దాన్ని స్వీకరించి ముందుకు సాగాలి అని సూచించారు. నిర్దిష్టత, అవకాశాలు అనే రెండు కాన్సెప్ట్‌ల ద్వారా తెలంగాణ అభివృద్ధి నమూనాను ఆయన వివరించారు. మౌలిక వసతులు, విశ్వసనీయమైన ప్రజా సేవల ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఒక నిర్దిష్టమైన వాతావరణం కల్పించడంతోపాటు ఇన్నోవేషన్, వ్యవస్థాపకతను ప్రోత్సహిస్తూ ఒక ఇకోసిస్టమ్‌ను సృష్టించి, కొత్త అవకాశాలకు అనుకూలమైన వాతావరణాన్ని కూడా నిర్మించాలని అన్నారు. ఈ సందర్భంగా సాగునీరు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాల్లో తెలంగాణ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి కేటీఆర్ వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తూ కరవు ప్రభావిత తెలంగాణ ప్రాంతాలకు గోదావరి జలాలను ఎలా తరలించాలనే చారిత్రక సవాలుకు ఇంజినీరింగ్ పరిష్కారం ఈ ప్రాజెక్టు అని అభివర్ణించారు. తెలంగాణలో ధాన్యం(వరి) ఉత్పత్తి 201415లో సుమారు 44.4 లక్షల టన్నులు ఉంటే 202324లో అది 168.8 లక్షల టన్నులకు పెరిగిందని కేటీఆర్ తెలిపారు. ఇన్నోవేషన్ ఇకోసిస్టం గురించి మాట్లాడుతూ టీహబ్, వీహబ్, టీవర్క్స్, టాస్క్ వంటి సంస్థల పాత్రను వివరించారు. వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, మహిళలకు అవకాశాలు కల్పించడం, నమూనా రూపకల్పన, హార్డ్‌వేర్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడం, యువతను పరిశ్రమలతో అనుసంధానం చేయడంలో వీటి పాత్రను వివరించారు. ఇంక్యుబేషన్, నమూనా రూపకల్పన నుంచి మార్కెట్‌కు సిద్ధమైన సంస్థగా ఎదిగిన స్కైరూట్‌ను తెలంగాణ ఇన్నోవేషన్ వ్యవస్థకు ఉదాహరణగా కేటీఆర్ ప్రస్తావించారు. పరిమితులను సమస్యలుగా చూడకుండా నిరంతరం నేర్చుకోవడం, మెరుగుపడటం, వాటిని అమలు చేయడంపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ముఖాముఖిలో రాజకీయాలు, ప్రజా విధానాలు, డీలిమిటేషన్, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులు పలు ప్రశ్నలు అడిగారు.. వాటికి కేటీఆర్ ఇచ్చిన సమాధానాలకు ప్రశంసలు వెల్లువెత్తాయి. తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించే అవకాశం కల్పించినందుకు ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి, విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించే అవకాశం కల్పించినందుకు యూనివర్సిటీ యాజమాన్యానికి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ సి.రాజ్ కుమార్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు ప్రోత్సహించండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించి రాష్ట్రంలో ఫ్యాబ్ పరిశ్రమలతోపాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేలా సింగపూర్ కంపెనీల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబుతో సచివాలయంలో బుధవారం సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. హై వాల్యూ ఇండస్ట్రీస్, ఆర్ అండ్ డీ, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్ అండ్ డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ కంపెనీలకు విస్తృత అవకాశాలున్నాయన్నాయన్నారు. ఆ మేరకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, అవకాశాలపై అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్



సమ్మిట్ 2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, ఇండియా డైరెక్టరేట్ డైరెక్టర్ జీన్ యీ, సౌత్ ఏషియా ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆడ్రీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు నీటి గోస తీర్చిన భగీరథుడు కేసీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

ఉమ్మడి పాలనలో కరవు, వలసలకు నిలయంగా ఉన్న పాలమూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే దిశగా నాటి కేసీఆర్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం నార్లాపూర్ పంపులను ప్రారంభించి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఈమేరకు స్పందించారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చడం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కేసీఆర్ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ జిల్లాల్లోని ప్రాంతాలకు సాగునీరు అందించడంతోపాటు తాగునీటి అవసరాలను తీర్చాలని ప్రణాళిక రూపొందించినట్లు అధికారిక ప్రాజెక్టు పత్రాలు పేర్కొంటున్నాయన్నారు. సుమారు 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీరు అందించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారని, 2023 సెప్టెంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా నార్లాపూర్ వద్ద ఈ ఎత్తిపోతల పథకం తొలి దశ వెట్ రన్‌ను ప్రారంభించారని గుర్తు చేశారు. నార్లాపూర్ పంప్‌హౌస్‌లో భారీ సామర్థ్యం కలిగిన పంపులను ఆన్ చేసి శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ప్రారంభించారంటూ పంపు ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రాజెక్టులో మిగిలి ఉన్న పనులను ప్రభుత్వం వేగంగా పూర్తి చేసి పంట పొలాలకు నీటిని అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పాలమూరు ప్రజల నీటి అవసరాలను ప్రభుత్వం విస్మరించకుండా ప్రాజెక్టు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# ధరణిని అడ్డంపెట్టుకున్నారు.. పట్టాలు చేసుకున్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

ధరణిని అడ్డం పెట్టుకుని భూదాన భూములను పట్టా చేసుకున్నారు అని బీఆర్ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. శాసనసభలో బుధవారం ఆయన భూముల అక్రమ పట్టాలు, అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు జరిగిన సంఘటనలపై మాట్లాడారు. గత ప్రభుత్వంలో అటవీ భూముల నుండి 106 ఎకరాల భూమి గండ్రకు అప్పగించారని, ఈ విషయంలో కలెక్టర్‌ను సుప్రీంకోర్టు తిట్టిందని చెప్పారు. సిరిసిల్లలో ఎనిమిది వేల అసైన్డ్ భూములు బదలాయించారన్నారు. సందీప్ ఝూను కలెక్టర్‌గా వేస్తే రెండు వేల ఎకరాలు బయటకు తీశారన్నారు. మైహోమ్ రామేశ్వర రావుకు ఎయిర్‌పోర్టుకు అనుకుని 2647 ఎకరాల భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. ప్రజల సొమ్ము ఇలా కొల్లగొడతారా అని ప్రశ్నించారు. కాప్రాలో అవేక్యు ప్రాపర్టీ అని నమస్తే తెలంగాణలో రాయించారని, తర్వాత ధరణి తెచ్చి మేల్లచెరువులో భూదాన్ భూములు లాక్కుందని, మైహోమ్ 113 ఎకరాలు సిమెంట్ ఫ్యాక్టరీకి వాడుకుంటున్నారని చెప్పారు. అసైన్డ్ భూములు.. వక్ఫ్ భూములు అన్నీ మై హోమ్ వాళ్ళు లాక్కోవచ్చా అని ప్రశ్నించారు. భూములు ఎక్కడ కనిపించినా గద్దల లెక్క వాలిపోయారు.. లక్ష కోట్ల భూములు లాక్కున్నారు.. ఈ చర్చ రాకుండా ఉండాలనే సభలో గందరగోళం చేయాలని చూశారని సీఎం బీఆర్ఎస్ సభ్యులపై విమర్శలు గుప్పించారు. ఆడబిడ్డలను అడ్డంపెట్టుకుని అడ్డుకోవాలి అనుకున్నారు.. శిశుపాలునికి కూడా వంద తప్పులు చేస్తేనే శిక్ష పడింది.. ఎవరికి అయినా సమయం వస్తుంది.. అప్పుడే శిక్ష పడుతుంది అన్నారు. 22ఎను అడ్డంపెట్టుకుని తమపై నిందలు వేయాలని చూశారు.. తాము అన్నీ బయటపెడుతున్నామన్నారు. సంగారెడ్డిలో భూముల చిట్టా కూడా బయటపెడతా అన్నారు. ఇలాంటి వాళ్లను మనం క్షమిస్తే మనల్ని భవిష్యత్ తరాలు క్షమించవు అని సీఎం అన్నారు. వీటన్నింటిపై సిట్ విచారణకు సిఫార్సు చేస్తున్నానన్నారు. సామాన్య ప్రజల సమస్య పరిష్కారం అయ్యేలా కమిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**చరిత్ర కొంతమందిని ఎప్పుడూ క్షమించదు**

గతంలో తప్పిదాలపై చర్చ జరిగితేనే భవిష్యత్తులో పొరపాట్లు సరిదిద్దుకోవచ్చునని ముఖ్యమంత్రి అన్నారు. కానీ ప్రతిపక్షం గతంలో జరిగిన తప్పులను చర్చించకూడదని సభ నుంచి బయటకు వెళ్లిందన్నారు. విద్యుత్ కొరత రావాలి అని కొందరు క్షుద్ర పూజలు చేశారు

ఇది కూడా సభలో చర్చకు వస్తుంది అని భయపడ్డారు.. తమ ప్రభుత్వానికి ప్రతీ ఆడబిడ్డ సమానమే.. సామాన్య మహిళలు అయినా గౌరవంగా చూసుకుంటాం.. కొంతమంది ప్రతిపక్ష నాయకులు వికృత చేష్టలతో వ్యవహరించారు అని అన్నారు. స్పీకర్‌గా ఒకరిని ఆమోదం పొందిన తరవాత అందరికీ సమాన హక్కులు కాపాడే పని చేస్తారని, అలాంటి చైర్‌ను కాపాడుకోవడానికి గత ప్రభుత్వం కమిటీ వేసి రూల్స్ రాసుకున్నారని తెలిపారు. శాసనసభ నిర్వహించడానికి ప్రొసీజర్ సిద్ధం చేసింది గత ప్రభుత్వమేనన్నారు. నినాదాలతో ఉన్న డ్రెస్ వేసుకుని రావద్దని సభ ఆమోదం చేసింది హరీష్ మంత్రిగా ఉన్నప్పుడేనన్నారు. పోలీసు అధికారులు వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేస్తారు.. స్పీకర్ ఆదేశాలు అమలు చేస్తారు.. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా నల్ల చొక్కాతో వచ్చారు కదా అంటున్నారు.. నినాదాలతో కూడిన టి షర్ట్ వేసుకుని రావద్దు అని స్పీకర్ ఆదేశిస్తే అనుమతించరు.. పార్లమెంటు నిబంధనలు అక్కడ.. అసెంబ్లీలో నిబంధనలు ఇక్కడ అమలు చేస్తారు అని సీఎం స్పష్టం చేశారు. పోడియం లోపలికి వస్తే సభ్యుడు సస్పెండ్ అయినట్టే అని వారు చట్టం చేశారు.. కానీ మీరు గౌరవంగా క్షమించారు.. సభలో మైక్ ఇచ్చారు.. సభలో సభ్యులను, సభ బయట స్పీకర్‌ను దూషించారు.. సభలోకి వచ్చాకా మార్పు వచ్చి ఉంటుందేమో అని మైక్ ఇచ్చారు.. అప్పుడు కూడా అలాగే చేశారు.. అందుకే మీరు సస్పెండ్ చేశారు అని స్పీకర్‌నుద్దేశించి సీఎం అన్నారు.

# పొదుపుతోనే డిమాండ్‌ను దాటగలం

**మొదటిపేజీ తరువాయి**



మన ముందే మరో విద్యుత్ కేంద్రం ఉందని, దానికి పొగ గొట్టం, బొగ్గు గని, భూమి, కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ అవసరం లేదని, అదే ఇంధన సామర్థ్యమని వివరించారు. మెరుగైన మోటర్లు, సమర్థవంతమైన శీతలీకరణ వ్యవస్థలు, ఇంధన సామర్థ్య భవనాలు, మెరుగైన పారిశ్రామిక ప్రక్రియలు, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రతి మెగావాట్ విద్యుత్ డిమాండ్‌ను శాశ్వతంగా తగ్గించగలిగితే మొత్తం విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో భవిష్యత్తులో విద్యుత్ అవసరం మరింత పెరుగుతుందని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమలు, తయారీ రంగం, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున అభివృద్ధి వేగాన్ని తగ్గించడం పరిష్కారం కాదని, ప్రతి యూనిట్ విద్యుత్తుతో మరింత ఆర్థిక కార్యకలాపాలను సాధించడమే పరిష్కారమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పారిశ్రామిక సంస్థలు తక్కువ విద్యుత్ వినియోగిస్తే వాటి నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు. తెలంగాణలో పీక్ విద్యుత్ డిమాండ్ తగ్గితే ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. దేశానికి ఇంధన భద్రత పెరగడంతోపాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం, ఉద్గారాలు తగ్గుతాయని వివరించారు. ఇంధన సామర్థ్యం వ్యాపార సంస్థల నిర్వహణ వ్యయాలను తగ్గించడంతోపాటు వనరుల ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు. గొప్ప ఆవిష్కరణలు ఎప్పుడూ ప్రయోగశాలల్లోనే జరగాల్సిన అవసరం లేదన్నారు. ఒక పరిశ్రమలో విజయవంతమైన సాంకేతికత మరో పరిశ్రమకు ఉపయోగపడుతుందని చెప్పారు. సిమెంట్ పరిశ్రమలో పరిష్కరించిన సమస్య ఉక్కు పరిశ్రమకు ఉపయోగపడవచ్చని, పేపర్ మిల్లులో అమలు చేసిన ఇంధన సామర్థ్య విధానం ఇతర రంగాలకు ఆదర్శంగా నిలవవచ్చని అన్నారు. తదుపరి కొత్త సాంకేతికత ఏమిటి అనే ప్రశ్నతోపాటు ఇప్పటికే ఏది విజయవంతంగా పనిచేస్తోంది.. దాన్ని ఎంత వేగంగా విస్తరించగలం అనే ప్రశ్న కూడా ఉండాలి అని ఆయన సూచించారు. భారత్‌లో మంచి పైలట్ ప్రాజెక్టులకు కొరత లేదని, ఒక కర్మాగారంలో విజయవంతమైన ప్రయోగాన్ని వంద కర్మాగారాలకు విస్తరించడమే అసలు సవాలని అన్నారు.

**ఏఐతో ఇంధన వినియోగంలో సమర్థత**

ఇంధన సామర్థ్యంలో తదుపరి తరం సాంకేతికతలు కీలక పాత్ర పోషించనున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుదీకరణ, డిజిటలైజేషన్, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌తోపాటు కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. సెన్సర్ల ద్వారా ఎక్కడ విద్యుత్ వృథా అవుతుందో గుర్తించవచ్చని, డిజిటల్ వ్యవస్థలతో పారిశ్రామిక ప్రక్రియలను నిరంతరం మెరుగుపరచవచ్చని చెప్పారు. మానవ ఆపరేటర్లు గుర్తించలేని నమూనాలను కూడా కృత్రిమ మేధస్సు గుర్తించగలదన్నారు. భవిష్యత్తులో కర్మాగారాలు విద్యుత్ వినియోగదారులుగానే కాక విద్యుత్ వ్యవస్థలో చురుకైన భాగస్వాములుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన సామర్థ్యం విషయంలో పరిశ్రమలకు మూడు సూచనలు చేశారు. ఇంధన వినియోగాన్ని కొలవకుండా వ్యవస్థాగత మార్పులు చేయడం సాధ్యం కాదని, అందుకే దీనిని ఏడాదికోసారి నిర్వహించే ఆడిట్‌గా కాక నిరంతర పర్యవేక్షణ ప్రక్రియగా మార్చాలని స్పష్టం చేశారు. అలాగే, ఒక పరిశ్రమలో విజయవంతమైన పొదుపు విధానాలను ఇతర వందలాది సంస్థలు నేర్చుకుని అమలు చేసేలా అనుభవాల మార్పిడికి అనువైన వ్యవస్థను రూపొందించాలని పిలుపునిచ్చారు. దీంతోపాటు ప్రభుత్వం, ఆర్థిక, విద్య, సాంకేతిక సంస్థలు పరిశ్రమలతో కలిసి పనిచేస్తూ వాణిజ్యపరంగా లబ్ధి చేకూర్చే ఉత్తమ సాంకేతికతలను విస్తృత స్థాయిలో అన్ని సంస్థలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

**తెలంగాణకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు**

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని, అత్యుత్తమ అంతర్జాతీయ విమానాశ్రయం, మెరుగైన రహదారులు, ఔటర్ రింగ్ రోడ్, శక్తి, ప్రతిభ, అనుకూల వాతావరణంతోపాటు శాంతిభద్రతలు రాష్ట్రానికి బలమైన అంశాలని పేర్కొన్నారు. తెలంగాణ స్నేహపూర్వక, పారిశ్రామిక అనుకూల రాష్ట్రంగా ఉందన్నారు. పెట్టుబడిదారులను ప్రభుత్వం సంపద సృష్టికర్తలుగా భావిస్తోందన్నారు. కలిసి ఎదగడానికి తెలంగాణ రాష్ట్రానికి సంపద సృష్టికర్తలందరికీ స్వాగతం పలుకుతున్నాం అని భట్టి అన్నారు.

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ**

తెలంగాణ.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ రంగంతోపాటు అన్ని ఇతర రంగాలను కూడా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతులు, ఇంధన రంగం తదితర అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

**డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్**

ఈ ఏడాది కూడా డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. మీ అందరూ గ్లోబల్ సమ్మిట్‌కు తప్పకుండా హాజరై తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. ప్రజలకు, పరిశ్రమలకు మరింత విద్యుత్ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రతి యూనిట్ విద్యుత్‌తో మరింత ఫలితాన్ని సాధించాలన్నారు. మరింత ఉత్పత్తి చేయాలి.. మరింత అభివృద్ధి చెందాలి.. వృథాను తగ్గించాలి అనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# నాణ్యమైన విద్యకు ప్రజా ఉద్యమమే పునాది

- **ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసీయూలో ఉంది**
- **ప్రజలే వైద్యులై చికిత్స చేసి బతికించుకోవాలి**
- **తెలంగాణ విద్యా కమిషన్ మాజీ చైర్మన్ మురళి**



**ఖమ్మం, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

ప్రజలకు నాణ్యమైన విద్య లభించాలంటే రాజకీయ వ్యవస్థపై ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణ విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ప్రజల నుంచి డిమాండ్ లేకుండా ఏ పాలకవర్గం విద్యావ్యవస్థను సరిదిద్దుతుందని భావించలేమని, ఆశించడం కూడా పొరపాటేనని అన్నారు. ఖమ్మం మయూరి సెంటర్లోని ఓ హోటల్‌లో విద్యాభిమానులు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలతో బుధవారంజరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసీయూలో ఉందని, ప్రజలే డాక్టర్లుగా మారి దానికి చికిత్స చేసి బతికించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం 40 లక్షల మంది పిల్లల తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణకు చట్టం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని సౌకర్యాలు గల తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా మార్చితే ప్రైవేటు బడులకు పిల్లలను పంపాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 37శాతం మంది పిల్లలే చదువుతున్నారన్నారు. ఇలాగే అసౌకర్యంగా కొనసాగితే ప్రభుత్వ బడి మరింత దిగజారే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో బస్సు యాత్ర లో పాల్గొన్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పద్మజా షా, ఎం.చంపాలాల్, పి .అశోక్ కుమార్, సృజన యాదవ్, పోరన్న, ఎం.నర్సింహరావు, హరీష్, రుబీనా, నిఖిల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి సీనియర్ జర్నలిస్టు, ఎడ్యుకేషన్ ఎనలిస్టు ఎన్.తిర్మల్ మోడరేటర్ గా వ్యవహరించారు. సమావేశంలో డాక్టర్ యం.యఫ్ గోపినాథ్, భద్రూనాయక్, పిఆర్టీ యు జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్, టిపిటీ యఫ్ జిల్లా అధ్యక్షుడు జి.మల్లయ్య, యుటీయఫ్ ప్రతినిధి ఉద్దండు, ధర్మసమాజ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుంక రశ్రీనివాస్, పిడియస్యు జిల్లా కార్యదర్శి మ స్తాన్, బలహీనవర్గాల జాక్ కన్వీనర్ పి. రాంబాబు, కనకయ్య, రిటైర్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి టి.వేణు, నాగిరెడ్డి, ప్రజానాట్యమండలి దేవేందర్, బొబ్బిలి భారత్ చంద్ర, మణిభూషణాచారి, ఖలీల్, ఝూన్సీ, సునీత, సృజన, విజయకుమార్ గుంతేటి వీరభద్రం తదితర 30 మంది విద్యారంగం ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రౌండుటేబుల్ సమావేశం ప్రభుత్వ బడులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దడానికి మండలానికి నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు పాఠశాల ఫీజులు నియంత్రణ చేయాలని, చట్టబద్ధంగా విద్యకు బడ్జెట్‌లో ఏటా 18శాతం నిధులు కేటాయించాలని తీర్మానం చేసింది. ఈ మూడు అంశాలపై జరిగే ఉద్యమానికి సైతం సమావేశం సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

# వినాయక నిమజ్జనంలో విషాదం

- **ఆరుగురు విద్యార్థుల మృతి**
- **చెరువులో మట్టి కోసం తీసిన గుంతలతోనే ప్రమాదం**
- **ఈత రాకపోవడంతో విగ్రహం సహా మునిగిపోయిన విద్యార్థులు**
- **ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే జీఎంఆర్**
- **ప్రాచీన్ హాస్పిటల్‌కు చేరుకున్న సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్**
- **మంత్రి సీతక్క దిగ్భ్రాంతి**




**పటాన్ చెరు, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతిచెందారు. నిమజ్జనం కోసం నేరేడు చెరువులో దిగి విద్యార్థులు మృతిచెందారు. మృతులను పెద్ద కంచర్ల చెందిన శిరీష చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తించారు. మృతులు నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా సెకండ్ ఇయర్), గణేష్ (డిప్లొమా సెకండ్ ఇయర్), ఉదయ్ కిరణ్ (డిప్లొమా థర్డ్ ఇయర్), శ్యామ్ కుమార్ (డిప్లొమా ఫస్ట్ ఇయర్), సిద్ధార్థ్ (టెన్త్ క్లాస్) చదువుతున్నారు. విద్యార్థుల మృతి పట్ల పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాచీన గ్లోబల్ హాస్పిటల్‌కు వెళ్లి విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పించారు. గురువారం ఉదయం 10 గంటల లోపు పోస్టుమార్టం పూర్తి చేయాలని, తదనంతరం వారి వారి సొంత స్థలాలకు అంబులెన్స్‌లో తరలించాలని అధికారులను ఆదేశించారు. సొంత నిధులతో అంబులెన్స్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్ ప్రాచీన్ హాస్పిటల్‌కు చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఒకేసారి ఆరుగురు విద్యార్థులు చెందడం పట్ల ఆయన తీవ్రంగా కలతచెందారు. శిరీష ట్రస్ట్ శివనగర్ చౌరస్తా పెద్దకంజర్లలో ఉండగా 70 మంది విద్యార్థులు ఒకటవ తరగతి నుండి పాలిటెక్నిక్, బీటెక్ వరకు చదివే పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులను మాత్రమే ట్రస్టులో చేర్చుకుంటారు. ఆంధ్రకు చెందిన కృష్ణంరాజు అనే వ్యక్తి తన కుమార్తె శిరీష పేరు మీద ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతిచెందడంతో పటాన్ చెరు ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది.

**విద్యార్థుల మృతిపై రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు మృతిచెందడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**మంత్రి సీతక్క దిగ్భ్రాంతి**

సంగారెడ్డి జిల్లా పఠవన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులోకి దిగి ఆరుగురు చిన్నారులు మృతిచెందిన ఘటనపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగ వేళ ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు మంత్రి సీతక్క సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, చేపట్టిన సహాయక చర్యలు, బాధిత కుటుంబాలకు అందుతున్న సహాయం తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓఝూతో మంత్రి సీతక్క మాట్లాడారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం, పిల్లల భద్రతకు సంబంధించిన చర్యలను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల భద్రత విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా నిమజ్జన కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో పిల్లలు ప్రమాదకరమైన నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.

# మేడిగడ్డ బ్యారేజీకి పోటెత్తిన వరద

**జయశంకర్ భూపాలపల్లి, ఆశ్వి అప్డేట్స్:**

మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్ కు వరద నీరు భారీగా వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా బరాజ్ కు వరద పెరుగుతోంది. మంగళవారం 94,640 క్యూసెక్కుల ప్రవాహం రాగా బుధవారం 1.08,500 క్యూసెక్కులకు పెరిగింది. మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ గరిష్ట నీటి ప్రవాహం ఎత్తు రివర్ బెడ్ నుండి సముద్ర మట్టానికి 100 మీటర్లు కాగా, ప్రస్తుతం 90.50 మీటర్ల ఎత్తులో ఉందని భారీ నీటి పారుదల శాఖ ఈఈ సురేశ్ తెలిపారు.

# గజం భూమి ఎక్కువ ఉన్నా సరెండర్ చేస్తా

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

తాను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భూముల కన్నా గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తేల్చి చెప్పారు. అసెంబ్లీలో 22ఏపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు ప్రస్తావించిన అంశంపై 'ఎక్స్' వేదికగా ఆమె స్పందించారు. అసెంబ్లీలో సీఎం ఎవరెవరి పేర్లు ప్రస్తావించి వారికి ఎక్కువ భూములు ఉన్నట్లు చెప్పారో వారందరిపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అయితే□ వారందరిపై సరైన విచారణ జరిపిస్తారన్న నమ్మకం తనకు లేదన్నారు. సీఎం చదివిన భూముల చిట్టాలో నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన గుంట నక్క, కేసీఆర్ ఫాం హౌస్‌లో ఉండే సీఎం గూఢచారి సహా నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలి అని డిమాండ్ చేశారు. తాను ఎప్పటినుంచో చెప్తున్నట్టుగా గుంపు మేస్త్రీ - గుంటనక్క కలిసే ఉన్నారని మరోసారి స్పష్టం చేశారు. వారిద్దరూ కలిసే ఈ డ్రామాలు చేస్తున్నారని కవిత మండిపడ్డారు. నిబంధనలు అతిక్రమించి తనకు గజం భూమి ఎక్కువగా ఉన్నా, ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భూమి కన్నా గజం అదనంగా ఉన్నట్టు తేలినా ఆ భూములు ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని మరోసారి స్పష్టం చేస్తున్నానన్నారు.

# హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

**మొదటిపేజీ తరువాయి**

ప్రతినిధులకు వివరించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్యపరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ బృందం బుధవారం భేటీ అయింది. మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి అంశాలను సింగపూర్ ప్రతినిధులకు సీఎం వివరించారు. హైదరాబాద్‌ను పర్యాటకంగానే కాక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్న సీఎం ఇప్పటికే హార్వార్డ్, ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీల, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తమ ఆఫ్ షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించినట్లు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతోపాటు, రాష్ట్ర అభివృద్ధికి ఆర్థికపరమైన సహకారం అందించాలని సీఎం ఆ ప్రతినిధులను కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అన్ని రకాలుగా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. పెట్టుబడులపై సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సింగపూర్ ప్రతినిధులను ఫ్యూచర్ సిటీలో డిసెంబరులో నిర్వహించే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, కాన్సుల్‌జనరల్ విలియం చిక్, ఇతర సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాత దరఖాస్తుల బదిలీకి అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

హౌసింగ్ బోర్డు చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ సొంతింటి పథకానికి సంబంధించి 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో వెసులుబాటు కల్పించినట్లు బోర్డు వైస్ చైర్మన్, కమిషనర్ వి.పి.గౌతమ్ తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాల్లో ఏదైనా ఒక నియోజకవర్గం కింద దరఖాస్తు చేసుకుని ప్రస్తుతం ఎల్‌బీ నగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో నివసిస్తుంటే తమ పాత దరఖాస్తును ఈ నియోజకవర్గాలకు బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ పాత దరఖాస్తు వివరాలతో హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోని https://tghb.telangana.gov.in/curestatus లింక్ ద్వారా ఈనెల 20లోగా దరఖాస్తు బదిలీ కోసం అభ్యర్థించాలని గౌతమ్ సూచించారు. అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తు బదిలీ జరుగుతుందని, ఈ బదిలీ నివాస ధ్రువీకరణతో పాటు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన అన్ని అర్హతలు, నిబంధనల పరిశీలనకు లోబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం అభ్యర్థులు కొత్తగా లేదా ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించరాదన్నారు. దరఖాస్తు బదిలీ చేయడం వల్ల ఇంటి కేటాయింపుపై ఎలాంటి హక్కు ఏర్పడదని, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, నిర్దేశించిన కేటాయింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి నగదు చెల్లించవద్దని గౌతమ్ కోరారు. అధికారిక సమాచారం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధీకృత మార్గాల ద్వారా మాత్రమే తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు https://tghb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 04024603572ను సంప్రదించవచ్చునన్నారు.

# పటేల్ ధైర్యాన్ని స్మరించుకోవాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, ఆశ్వి అప్డేట్స్ :**

భగత్ సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి పేర్లు వింటే యువతరం నరనరాల్లో దేశభక్తి ఉప్పొంగుతుంది.. అదే స్థాయిలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ త్యాగాన్ని, ధైర్యాన్ని కూడా భావితరాలు స్మరించుకోవాలి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నాడు పటేల్ తెగువ చూపకపోయి ఉంటే నేడు తెలంగాణ భారత యూనియన్‌లో ఉండేది కాదని స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన చారిత్రక ఫొటో ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులతో కలిసి ప్రదర్శనను తిలకించిన ఆయన నిజాం నిరంకుశ పాలనపై సాగిన వీరోచిత పోరాట ఘట్టాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ దేశమంతటికీ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే హైదరాబాద్ సంస్థానానికి మాత్రం దాదాపు పదమూడు నెలల తర్వాత 1948 సెప్టెంబరు 17న స్వేచ్ఛ లభించిందని గుర్తు చేశారు.



## పిల్లల ఎదుగుదలకు సమతుల్య ఆహారం అవసరం

- **జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సతీష్**

**ఆశ్వి అప్డేట్స్, చిట్యాల, సెప్టెంబర్ 16:**

పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్యమైన పౌష్టికాహారం ఎంతో అవసరమని జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సతీష్ అన్నారు. చిట్యాల మండలం వనిపాకాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎంపీడీవో జె. పాండు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఎదుగుదలకు తోడ్పడవచ్చని వివరించారు. పిల్లలకు విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా లభించే ఆహారాన్ని అందించాలని సూచించారు.

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్ ద్వారా తల్లిదండ్రులు, గ్రామ ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రణీత, సిబ్బంది మాధవరెడ్డి, హైస్కూల్ హెడ్‌మాస్టర్ శివయ్య, సీహెచ్. నర్సింహాచారి, అంగన్‌వాడీ టీచర్ జానకమ్మ, హెడ్‌మాస్టర్ కౌసల్య, సెక్టర్ శివారి, ఏఎన్ఎం ధనమ్మ, ఆశా కార్యకర్తలు బి. నీరజ, బి. లక్ష్మి, వార్డు సభ్యురాలు సారిక, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష

**ఆశ్వి అప్డేట్స్, సిద్ధిపేట, సెప్టెంబర్ 16:**




మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ చెట్టుక్రింది ముత్యం రాజు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముగ్గురు లారీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా, వారిలో డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మద్యం సేవించి మోటార్‌సైకిల్ నడుపుతున్న మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టుబడిన నలుగురిని బుధవారం సిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం నలుగురికీ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది.

శిక్షకు గురైన వారిలో కేశవపూర్‌కు చెందిన యటాకర్ల శ్రీనివాస్, సిద్ధిపేట పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన మహమ్మద్ షఫీ, అనంతపూర్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన ఆలూరి లక్ష్మయ్య, నల్లగొండ జిల్లా పెద్దకొండూరుకు చెందిన ఎస్. పర్శరాములు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ముత్యం రాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారుడి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.10 వేల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేల జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.




## పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం

- **వర్షా కాల విధులకు రెయిన్‌కోట్లు అందజేసిన ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**ఆశ్వి అప్డేట్స్, నల్లగొండ, సెప్టెంబర్ 16:**

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. వర్షాకాలంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రెయిన్‌కోట్లు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, పెట్రోలింగ్‌తో పాటు ఇతర విధులను పోలీస్ సిబ్బంది నిరంతరం నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేలా అవసరమైన సౌకర్యాలు, రక్షణ పరికరాలు కల్పించడం శాఖ బాధ్యత అన్నారు. ప్రజల భద్రత కోసం ప్రతికూల వాతావరణంలోనూ క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదురైతే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు తమ ఆరోగ్యం, సంక్షేమం పట్ల కూడా శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. పోలీస్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు సంతోష్, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక మండపాలను సందర్శించిన వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా

- **భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి**

**ఆశ్వి అప్డేట్స్, వికారాబాద్, సెప్టెంబర్ 16:**

వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ మంగళవారం రాత్రి వికారాబాద్ పట్టణంలోని వేంకటేశ్వర కాలనీ, శివాజీ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి మండపాల వద్ద చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులు, ప్రజల భద్రతకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, ఇతర పోలీసు అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నాగోల్ హత్య కేసులో 8 మంది అరెస్ట్

- **24 గంటల్లో కేసును ఛేదించిన ఎస్‌ఓటీ–నాగోల్ పోలీసులు.. మరో నలుగురి కోసం గాలింపు**

**ఆశ్వి అప్డేట్స్, హైదరాబాద్, సెప్టెంబర్ 16:**

